సాక్షి
తిరుపతి
గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



నమ్మితేనే ఓట్లు వేయండి
సీఎం జగనన్న పేదలందరికి మేలు చేశారని నమ్మితేనే వైఎస్సార్ సీపీకి ఓటు వేయండని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కోరారు. - 8లో



సైకత 'బ్రహ్మానందం'
ఏరూరుకు చెందిన సైకత శిల్పకారుడు మంచాల సనత్‌కుమార్ సముద్రం తీరంలో బ్రహ్మానందం సైకత శిల్పాన్ని రూపొందించారు. - 8లో



మేమంతా జగన్ వెంటే..
ఎన్నికల్లో సంక్షేమ సారథి సీఎం జగనన్న వెంట నడవడానికి మేమందరం సిద్ధంగా ఉన్నామని వైఎస్సార్ సీపీ నేతలు అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

టీటీడీ ప్రతిష్ట మరింత పెంచేలా కృషి చేస్తా



భూమన్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ప్రతిష్ట మరింత పంచేలా కృషి చేస్తానని, తనకు పైసా అవసరం లేకుండా సేవ చేస్తానని శ్వేత డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన భూమన సుబ్రహ్మణ్యంరెడ్డి(భూమన్) అన్నారు. బుధవారం తిరుపతి శ్వేత భవనంలో ఆయన శ్వేత డైరెక్టర్‌గా రెండోసారి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం తాను శ్వేత సంచాలకుడిగా ఉన్న సమయంలో కొన్ని చేయాల్సిన పనులు మిగిలిపోయాయన్నారు. ప్రధానంగా డిజిటల్ లైబ్రరీ, తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు, వేటూరు ప్రభాకర్‌శాస్త్రి ప్రాజెక్టు తన ఆధ్వర్యంలోనే నడిచాయని, తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టులో చాలా కీర్తనలు వెలుగులోకి తీసుకురావాలని, దొరకని రచనలన్నీ వెతికి వాటిని ప్రచురించాలన్నారు. తాను పైసా తీసుకోకుండా పనిచేస్తానని తెలిపారు. అనంతరం అర్చకులు ఆయన్ని ఆశీర్వదించారు. పలు ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో టీటీడీ కాటరింగ్ అధికారి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ఐదుగురు డిప్యూటీ కలెక్టర్లు

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని విభాగాల్లో జోరుగా సాగుతున్న బదిలీల్లో భాగంగా జిల్లాకు ఐదుగురు కొత్తగా డిప్యూటీ కలెక్టర్లను నియమించారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణ జిల్లా నుంచి శ్రీకాళహస్తి దేవస్థానం ఈఓగా ఎస్వీ నాగేశ్వరరావును నియమించారు. శ్రీకాళహస్తి ఆలయ ఈఓ రామారావును కృష్ణాజిల్లాకు బదిలీ చేశారు. తిరుపతి ఏపీఐఐసీ డిప్యూటీ కలెక్టర్‌గా వి.దేవేంద్రరెడ్డిని నియమించారు. ఏపీఐఐసీ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఎం.శ్రీనివాసులను నెల్లూరు జిల్లా రాపూర్ తెలుగుగంగకు బదిలీ చేశారు. తిరుపతి ఎస్‌డీసీగా సి.రేణుకను నియమించారు. తిరుపతి తుడా వైస్ చైర్మన్‌గా సుజనాను నియమించారు. చంద్రగిరి రైల్వేలైన్ భూసేకరణ ఎస్‌డీసీ వెంకటశివను ఎల్‌ఓసీఎల్ నంద్యాలకు బదిలీ చేశారు. తిరుపతి ఎల్‌పీజీకి డిప్యూటీ కలెక్టర్‌గా రామ్మోహన్‌ను నియమించారు.

డయల్ యువర్ ఈఓ రేపు

తిరుమల: డయల్ యువర్ ఈఓ కార్యక్రమం ఫిబ్రవరి 2వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుంది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి చానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డితో ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చు. ఇందుకు భక్తులు 0877–2263261 నంబర్‌లో సంప్రదించాలి.

అభివృద్ధి కృషి చేస్తా



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీషా

తిరుపతి అర్బన్: ఆధ్యాత్మిక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి సమన్వయంతో సమర్థవంతంగా కృషి చేస్తానని కలెక్టర్ లక్ష్మీషా పేర్కొన్నారు. హౌసింగ్ ఎండీగా పనిచేస్తున్న ఆయన బదిలీపై తిరుపతి జిల్లా కలెక్టర్‌గా విచ్చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, జేసీ శుభం భన్సల్, డీఆర్వో పెంచల కిషోర్ తోపాటు పలువురు జిల్లా అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమైన ప్రాంతాల్లో తిరుపతి ఒకటి అన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో పనిచేయడానికి తమ తల్లిదండ్రుల ఆశీర్వాదంతోపాటు తమకు అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తిరుపతికి ఎంతో చారిత్రక ప్రాముఖ్యత, ప్రాశస్త్యం ఉందని వెల్లడించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకుని సమర్థవంతంగా ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు ముందుకు సాగుతామని వెల్లడించారు. తిరుపతి జిల్లా ప్రోటోకాల్‌ను బాధ్యతగా నిర్వహిస్తామని చెప్పారు. కొత్త జిల్లా నేపథ్యంలో జిల్లా ప్రగతికి పెద్ద ఎత్తున కృషి చేస్తామని చెప్పారు. ప్రధానంగా ప్రభుత్వ ఆదేశాలు, పథకాలు తూచా తప్పకుండా అమలు చేస్తామని స్పష్టం చేశారు. జర్నలిజం ప్రజాస్వామ్యానికి వెన్నెముకగా ఉండాలని పాత్రికేయులు నిర్మాణాత్మక విమర్శ, ఫీడ్ బ్యాక్‌తో సమసమాజ నిర్మాణానికి తోడ్పడేలా ఉండాలని కోరారు.

ఒకప్పుడు ప్రభుత్వ వైద్యమంటే అందని ద్రాక్షగా ఉండేది. దీంతో పట్టణానికి పరుగులు తీసేవారు. ఆర్థిక స్తోమత లేనివారు మంచానికే పరిమితమయ్యేవారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైద్యానికి పెద్ద పీట వేసింది. పేదలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడానికి వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. దీంతో సర్కారు వైద్యం ఇంటి ముంగిటికే వచ్చింది. 14 రకాల వైద్యపరీక్షలు.. 12 రకాల చికిత్సలను ఇంటి వద్దే అందిస్తోంది. ఫలితంగా పల్లెకు ఆరోగ్యానందం చేకూరింది.



తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురంలో నిర్మాణం పూర్తి అయిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనం



రూరల్ మండలంలోని తనపల్లి విలేజ్ క్లినిక్

పల్లెకు ఆరోగ్యానందం



- పల్లె ప్రజల ముంగిటకే వైఎస్సార్ హెల్త్ క్లినిక్
- చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 88 హెల్త్ క్లినిక్‌ల మంజూరు
- ఇప్పటికే 67 భవన నిర్మాణాలు పూర్తి
- అందుబాటులోకి వచ్చిన సేవలు
- ఫిబ్రవరిలోపు అందుబాటులోకి వందశాతం

చంద్రగిరి నియోజకవర్గంలో జనాభా వివరాలు..

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
తిరుపతి రూరల్	59,449	57,996	1,17,445
చంద్రగిరి	28,334	28,952	57,286
పాకాల	28,025	28,642	56,667
రామచంద్రాపురం	15,669	15,704	31, 375
ఎర్రావారిపాలెం	14,123	13,888	28,011
చిన్నగొట్టిగల్లు	13,021	13,129	26,150
మొత్తం	1,70,274	1,69,960	3,40,234



దోర్నకంబాల వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్య బృందం

తిరుపతి రూరల్: జబ్బు చేస్తే పల్లెల నుంచి పట్టణాలకు పరుగులు తీయాల్సిన అవసరం లేకుండా పేద ప్రజలకు గ్రామాల్లోనే నిరంతరం వైద్యసేవలందించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ క్రమంలోనే గ్రామీణ ప్రజలకు వారి సొంతూరిలోనే వైద్య పరీక్షలు, చికిత్సలను అందుబాటులోకి తీసుకువస్తోంది. ప్రతి 2,500 జనాభాకు ఒక వైఎస్సార్ విలేజ్ క్లినిక్ అందుబాటులోకి ఉండేలా ఏర్పాట్లు చేసింది. తద్వారా చిన్న చిన్న జబ్బులకు చికిత్స కోసం 10 కిలోమీటర్ల దూరంలో ఉండే పీహెచ్‌సీకి వెళ్లాల్సిన అవసరం తప్పింది. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల కొత్త భవనాల నిర్మాణాన్ని ప్రభుత్వం ఇప్పటికే చేపట్టింది. ప్రతి హెల్త్ క్లినిక్‌కు రూ.20.30 లక్షలతో నియోజకవర్గ వ్యాప్తంగా రూ.17.86 కోట్లను మంజూరు చేసి, పనులను వేగవంతం చేశారు. ఫలితంగా నియోజకవర్గ వ్యాప్తంగా 88 హెల్త్ క్లినిక్‌లకు గానూ 53 సెంటర్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.



కుప్పంబాదూరులో రోగి ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ పూర్ణ, వైద్య బృందం

జనవరి నెలాఖారుకు మిగిలిన 23 భవనాలను కూడా వందశాతం పూర్తి చేయనున్నట్లు పంచాయతీరాజ్ డీఈ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

పీహెచ్‌సీలకు అనుసంధానం

మండలానికి రెండు పీహెచ్‌సీలను అందుబాటులోకి తేవడమే కాకుండా ఒక్కొక్క పీహెచ్‌సీలో ఇద్దరేసి డాక్టర్లు ఉంటారు. ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా సంబంధిత వ్యక్తి వివరాలన్నీ విలేజ్ క్లినిక్స్‌కు అందుబాటులో ఉంచుతారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా 12 రకాల వైద్య సేవలు గ్రామాల్లోనే అందుబాటులోకి వచ్చాయి. వ్యాధి గుర్తింపు నుంచి వైద్యం అందించడం, అనంతరం ఆరోగ్య మానిటరింగ్ వరకు గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా గ్రామీణులకు అందుబాటులోకి వచ్చాయి.

విలేజ్ హెల్త్‌క్లినిక్‌లో సేవలివీ..

- గర్భిణులు, చిన్నారుల సంరక్షణకు అవసరమైన వైద్యసేవలు
- నవజాత శిశు ఆరోగ్య సంరక్షణ సేవలు
- బాల్యం, కౌమార దశ ఆరోగ్య సంరక్షణ సేవలు
- కుటుంబ నియంత్రణ, గర్భ నిరోధక సేవలు, ఆరోగ్య సంరక్షణ సేవలు
- అంటు వ్యాధుల నిర్ధారణ.. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు
- జనరల్ అవుట్ పేషెంట్ కేర్
- వ్యాధుల స్క్రీనింగ్, నివారణ, నియంత్రణ,
- సాధారణ ఆప్తాల్మిక్ (కంటి సమస్యలు), ఈఎన్‌టీ సమస్యల కోసం జాగ్రత్తలు
- ప్రాథమిక నోటి ఆరోగ్య సంరక్షణ
- వృద్ధాప్య వ్యాధులకు చికిత్స, ఉపశమన ఆరోగ్య సంరక్షణ సేవలు
- కాలిన గాయాలకు, ప్రమాదాల్లో గాయపడిన (ట్రామా) వారికి అత్యవసర వైద్య సేవలు
- మానసిక ఆరోగ్య వ్యాధుల స్క్రీనింగ్, ప్రాథమిక నిర్వహణ

మంజూరైన వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు..

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు	88
మంజూరు చేసిన నిధులు రూ.17,86,40,000	
తిరుపతి రూరల్	29
చంద్రగిరి	20
పాకాల	11
రామచంద్రాపురం	10
చిన్నగొట్టిగల్లు	8
ఎర్రావారిపాళెం	5
తిరుపతి అర్బన్	5
మొత్తం	88
పునాదులు దశలో ఉన్నవి	1
పునాదులు పూర్తి అయినవి	4
రూఫ్ లెవల్ వరకు అయినవి	3
మోల్డింగ్ పూర్తి అయినవి	5
చివరి దశలో ఉన్నవి	8
నిర్మాణం పూర్తి అయి, విధులు నిర్వర్తిస్తున్న భవనాలు	67

ఉచితంగా 14 రకాల ప్రాథమిక పరీక్షలు...

వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలతో పాటు 14 రకాల ప్రాథమిక ఆరోగ్య పరీక్షలను సైతం ఉచితం అందించనున్నారు. హిమోగ్లోబిన్, గర్భిణులకు మూత్రన్ పరీక్షలు, బ్లడ్ షుగర్, మలేరియా, హెచ్‌ఐవీ, డెంగీ, కంటి పరీక్షలు, అయోడిన్ పరీక్షలు, వాటర్ టెస్టింగ్, హెపటైటిస్ బి, ఫైలేరియా, ర్యాపిడ్ టెస్ట్, కఫం పరీక్షలు చేస్తారు.

పరీక్షలతోపాటు ఉచితంగానే మందులు



వైఎస్సార్ గ్రామీణ విలేజ్ క్లినిక్‌లు అందుబాటులోకి వచ్చిన తర్వాత అలా.. నడుచుకుంటూ వచ్చి వైద్య పరీక్షలు చేసుకుంటున్నాం. వైద్య సిబ్బంది కూడా ఉచితంగా మందులు అందిస్తున్నారు. చాలా ఉపయోగకరమైన సేవలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచారు.
– పానేటి రాధ, పనపాకం, చంద్రగిరి

ఇంటికే వచ్చి మందులు ఇచ్చి వెళుతున్నారు..



మాది చంద్రగిరిలోని దాసర వీధి. మెరుగైన వైద్యం పొందలాంటే తిరుపతికి వెళ్లాల్సిందే. దీంతో చాలా ఇబ్బంది పడేవాళ్లం. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ఏర్పాటుతో పీహెచ్‌సీ డాక్టర్లు ఇంటివద్దకే వచ్చి సకాలంలోనే వైద్యపరీక్షలు చేసి, మందులు అందిస్తున్నారు. మనం మరిచిపోయినా గుర్తు చేసి మరీ ఇంటికే వచ్చి మందులు ఇచ్చే వ్యవస్థ ఒకటి వస్తుందని అసలు ఊహించలేదు. ఇది కదా అసలైన మార్పు అంటే.
– ఏములమ్మ, దాసరవీధి, చంద్రగిరి

సత్వర వైద్యం అందుతోంది



మాది తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం గ్రామం. వైద్యపరీక్షలు చేయించుకోవాలంటే 10 కిలోమీటర్ల దూరంలోని తిరుపతికి పరుగెత్తాల్సిందే. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రాష్ట్రంలో వైద్య విప్లవమే వచ్చింది. ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్న జగనన్న మేలు మరవలేం. దీంతో మాలాంటి పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం గడప వద్దకే వచ్చింది. అందువల్ల వ్యయప్రయాసలు తగ్గడంతో పాటు సత్వర వైద్యం అందుతోంది.
– సుబ్రమణ్యం, దుర్గసముద్రం, తిరుపతి రూరల్

పేదల ఆరోగ్యప్రదాత జగన్




మాది రామచంద్రాపురం మండలం మహంతువారిపల్లె. పేదల ఆరోగ్యప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. నాకు 70 ఏళ్లు. ఇంతవరకు నా చరిత్రలో చూడలేదు. ప్రభుత్వ వైద్యులు ఇంటికే వచ్చి వైద్యం అందించడం. వైద్య చరిత్రలో వైఎస్సార్ మాత్రమే అనితర సాధ్యుడు అనుకున్నాం. కానీ ఆయన బిడ్డ తండ్రినే తలపించేలా వైద్య సేవలను ప్రజలకు మరింత దగ్గరగా చేర్చాడు. నర్సుతో పాటు డాక్టర్ కూడా ఇంటికే వస్తున్నారు. జగన్‌కు రుణపడి ఉంటాం.
– ఎద్దల చెంగల్రాయులు, మహంతువారిపల్లె, రామచంద్రాపురం

జగన్ మేలు మరవలేం



నిజంగా జగన్ దేవుడు స్వామి. మాలాంటి పేదలకు భారంగా మారిన వైద్యాన్ని ఇంటి వద్దకే తీసుకువచ్చాడు. గతంలో ప్రభుత్వ వైద్యుడిని కలవాలంటేనే మరో జన్మ ఎత్తాలి. కానీ కలలో కూడా ఊహించని విధంగా మా ముంగిటికే లాక్కొచ్చాడు. కేవలం చేయి చూడటమే కాదు...14, 15 రకాల పరీక్షలు చేస్తున్నారు. ప్రైవేటుగా రక్తం పరీక్ష చేసుకోవాలంటే రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు ఖర్చు అయ్యేవి. కానీ పైసా ఖర్చు లేకుండా అడిగి మరీ వైద్యం అందిస్తున్నారు.
– శేషాద్రి, పీవీపురం, రామచంద్రాపురం

సామాన్య కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీలో పెద్దపీట



గురుమూర్తి

సాక్షి, తిరుపతి: వైఎస్సార్‌సీపీలో సామాన్య కార్యకర్తలకు పెద్దపీట వేస్తోంది. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రస్తుత ఎంపీ మద్దెల గురుమూర్తి పేరుని ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ పేరును ఖరారు చేశారు. వైఎస్సార్‌సీపీలో ఇద్దరూ అతి సామాన్య కార్యకర్తలే. ఏర్పేడు మండలం మన్నసముద్రం గ్రామానికి చెందిన గురుమూర్తి సామాన్య రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి. అటువంటి వ్యక్తిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి తిరుపతి ఎంపీని చేశారు. సీఎం జగన్ నమ్మకాన్ని వమ్ముచేయకుండా అనతి కాలంలోనే ప్రజా సేవకుడిగా పేరు తెచ్చుకున్నారు. గురుమూర్తిని మరోసారి తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే నూక తోటి రాజేష్‌ని సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్ర కటించారు. రాజేష్ కూడా సామాన్య పార్టీ కార్యకర్త కావడం గమనార్హం.

ఒంగోలు రీజినల్ కో–ఆర్డినేటర్‌గా చెవిరెడ్డి



తిరుపతి రూరల్: వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ రీజినల్ కో–ఆర్డినేటర్‌గా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆ మేరకు పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ విప్‌గా, చంద్రగిరి ఎమ్మెల్యేగా, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా ఇప్పటికే పార్టీలో పలు కీలక బాధ్యతలను చెవిరెడ్డి సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోనే కీలకమైన ఒంగోలు పార్లమెంట్‌కు రీజినల్ కో–ఆర్డినేటర్‌గా చెవిరెడ్డిని నియమించారు. ఒంగోలు పార్లమెంట్‌తోపాటు ఎంపీ పరిధిలోని ఏడు నియోజకవర్గల్లోనూ పార్టీ గెలుపు కోసం చెవిరెడ్డి కృషి చేయనున్నారు. తనపై నమ్మకంతో తనను రీజినల్ కో–ఆర్డినేటర్‌గా నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి చెవిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

నూకతోటి రాజేష్ వ్యక్తిగతం



తల్లిదండ్రులు: ఎస్. గంగాధరం, హేమలత
జననం: 25–8–1970
భార్యపేరు: చైతన్య భాను
కుమారుడు: చరిత్ శ్రీమాన్
స్వగ్రామం: వింజంలక్ష్మీరెడ్డిపల్లె, జీడీ నెల్లూరు మండలం
విద్యాభ్యాసం: ఎంఏ (పబ్లిక్ అడ్మిస్ట్రేషన్)
రాజకీయ నేపథ్యం : కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా సేవాదళ్ కార్యదర్శి (2004–2009)
ప్రస్తుత హోదా : జెన్ స్పోర్ట్స్ అకాడమీ జిల్లా అధ్యక్షుడు, జూడో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

శ్రీవారి దర్శనానికి 8 గంటలు



తిరుమల: భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 61,135 మంది స్వామివారిని దర్శించుకోగా 19,004 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.78 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



ఎర్రావారిపాలెంలో చెక్కు అందజేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

అతివల సాధికారతకు ఆసరా

భాకరాపేట: అతివల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేస్తున్నారని తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఎర్రావారిపాళెంలో బుధవారం జరిగిన నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన మాటకు కట్టుబడి వారు తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లిస్తూ సీఎం జగనన్న మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. చంద్రగిరి నియోజక వర్గంలో మహిళలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత కల్పించారన్నారు. పండుగ సందర్భాల్లో మహిళలకు కానుకలు అందజేస్తూ మహిళా పక్షపాతిగా నిలుస్తున్నారన్నారు. మండలంలో సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నట్లు తెలిపారు. తన తండ్రి అడుగ జాడల్లో నడుస్తూ మీ అందరి బిడ్డగా, అన్నదమ్ముడిగా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.



ఎర్రావారిపాలెం సభకు హాజరైన మహిళలు

క్లుప్తంగా

శ్రీవారి సేవలో కలెక్టర్ లక్ష్మీషా



ఆలయం ఎదుట తిరుపతి జిల్లా కలెక్టర్ లక్ష్మీషా

తిరుమల: తిరుపతి జిల్లా కలెక్టర్‌గా వచ్చిన లక్ష్మీషా బుధవారం ప్రాతఃకాల సమయంలో కుటుంబ సమేతంగా శ్రీవారిని సుప్రభాత సేవలో దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

టీటీడీ కళాశాలల ప్రిన్సిపాళ్ల బదిలీ





ఎస్వీడబ్ల్యూ ప్రిన్సిపల్ నారాయణమ్మ, ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి



ఎస్‌జీఎస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లను బదిలీ చేస్తూ టీటీడీ ఈఓ ధర్మారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న టీ నారాయణమ్మను పద్మావతీ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపల్‌గా బదిలీ చేశారు. ఆ కళాశాల ప్రిన్సిపల్ మహదేవమ్మ బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. అలాగే ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఎన్ వేణుగోపాల్‌రెడ్డిని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా బదిలీ చేశారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల కెమిస్ట్రీ విభాగాధిపతి బీ సత్యనారాయణను ఎస్‌జీఎస్ కళాశాల ప్రిన్సిపల్‌గా నియమించారు. బదిలీ అయిన మూడు కళాశాలల ప్రిన్సిపాళ్లు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా టీటీడీ డీఈఓ భాస్కరెడ్డి, అధ్యాపకులు ప్రిన్సిపాళ్లకు అభినందనలు తెలిపారు.

మేలు చేశారని నమ్మితేనే ఓట్లు వేయండి

- 99 శాతం హామీలు నెరవేర్చిన ఏకైక నాయకుడు జగనన్న
- చంద్రబాబు కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దు
- ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో పేదలందరికి మేలు చేశారని నమ్మితేనే జగనన్నకు ఓట్లు వేసి గెలిపించండని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అభ్యర్థించారు. తిరుపతి 3, 6, 42, 45వ డివిజన్లలో బుధవారం 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన తొలుత సంక్షేమ పథకాల బోర్డులను ఆవిష్కరించి, అక్కడ ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం స్థానికులు మాట్లాడుతూ జగనన్న లాంటి నాయకుడు అధికారంలో ఉంటే తమ లాంటి పేదలంతా ఎంతో సుభిక్షంగా జీవిస్తారని చెప్పారు. అందుకే ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తామంతా జగనన్నకే మద్దతుగా ఉంటామని చెప్పారు. ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలోనే ఇంతవరకు ఏ నాయకుడికి సాధ్యం కానన్ని సంక్షేమ పథకాలను అందించిన గొప్ప నాయకుడు జగనన్న అన్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలన్న దురుద్దేశంతో ఎన్నికల సమయంలో వందల హామీలను గుప్పించి, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను తుంగలో తొక్కేసే చంద్రబాబు లాంటి నాయకుడిని గతంలో చూశామని తెలిపారు. ఇప్పుడు మళ్లీ రాజకీయ అవగాహనే లేని పవన్‌కళ్యాణ్‌తో పొత్తు పెట్టుకుని పేద ప్రజలను మరోసారి మోసగించేందుకు వస్తున్నాడని, చంద్రబాబు చెప్పే కల్లబొల్లి మాటలను నమ్మవద్దని హెచ్చరించారు.

చరిత్రలో నిలిచిపోయేలా తిరుపతి అభివృద్ధి

తిరుపతి నియోజకవర్గంలో రూ.1700 కోట్లతో తిరుపతిని హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేయగలిగామంటే జగనన్న సాకారం వల్లేనని ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతిలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న 26 వేల మంది పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత జగనన్నదేనన్నారు. అలాగే తిరుపతిలో 18 మాస్టర్‌ప్లాన్ రోడ్లు, ఫ్రీలెఫ్ట్ రోడ్లను తీసుకొచ్చి తిరుపతిని సుందరంగా తీర్చిదిద్దామన్నారు. గత 20ఏళ్లుగా సాధ్యం కాని టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాల మంజూరు సీఎం జగనన్న సహకారంతోనే సాధ్యమైందన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాల పెంపు, అతిథి అధ్యాపకులు సర్వీసు రెగ్యులరైజేషన్ చేయడంతో పాటు రెండు రోజు క్రితం టీటీడీ బోర్డు సమావేశంలో వేలమందికి రూ.వేలల్లో జీతాలు పెంచి, వారి జీవితాల్లో



సభకు హాజరైన జనం

వెలుగులు నింపామన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కే బాబు, క్లస్టర్ ఇన్‌చార్జిలు సురేంద్రరెడ్డి, ఆదం సుధాకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మురళీరెడ్డి, కార్పొరేటర్లు తమ్ముడు గణేష్, అనీష్‌రాయల్, శేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, పార్టీ నాయకులు వెంకటేష్ రాయల్, నల్లాని బాబు, నాథమునిరెడ్డి, రామచంద్రారెడ్డి, తాతారెడ్డి, బాలాజీ, హరి పాల్గొన్నారు.

మేమంతా జగన్ వెంటే..



నాయకులతో కలసి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ గురుమూర్తి

నారాయణవనం: రాబోవు ఎన్నికల్లో సంక్షేమ సారథి జగనన్న వెనుక నడవడానికి మేమందరం సిద్ధంగా ఉన్నామని వైఎస్సార్ సీపీ మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం నారాయణవనంలో ఎంపీ మద్దెల గురుమూర్తి పార్టీ శ్రేణులతో కలిసి సిద్ధం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సీఎం జగనన్న పెద్దపీట వేశారన్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఎందరు ఎన్ని కుతంత్రాలు చేస్తూ, ఏకమైనా.. ఎన్నికల కురుక్షేత్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, సంక్షేమ ఫలాలను అందుకున్న ప్రతి ఒక్కరూ అండగా ఉన్నంత వరకు జగనన్నకు గెలుపు తథ్యం అని అన్నారు. పార్టీ గౌరవించి ఆదిమూలానికి సముచిత స్థానం కల్పించిన తర్వాత కూడా పార్టీ పెద్దలపై అవాకులు చవాకులు పేల్చుతున్నారని, ఇది ఏ మాత్రం సమర్థనీయం కాదన్నారు. నాలుగున్నర ఏళ్లుగా తన పదవిని అడ్డు పెట్టుకుని పైరవీలు చేసుకున్న ఆదిమూలం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదన్నారు. పచ్చపురుగు కాటుకు మందే లేదని, చంద్రబాబు ధృతరాష్ట్ర కౌగిలిలో చిక్కుకున్న వారెవరూ బాగుపడిన దాఖలాలు లేదన్న సత్యాన్ని ఆదిమూలం త్వరలోనే తెలుసుకుంటాడన్నారు. సత్యవేడు ప్రజలే గుణపాఠం నేర్పుతారని అన్నారు. పార్టీ మారినా కూడా ఆయనతో కలిసి పార్టీ మారేందుకు ఎవరు ముందుకు రాని పరిస్థితి నెలకొందన్నారు. పార్టీని నమ్మి పార్టీ వెంట నడిచే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కనివిని ఎరుగని రీతిలో సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్ సీపీకే సత్యవేడు నియోజకవర్గ ప్రజలు మద్దతు తెలుపుతున్నారని, మరోసారి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సారకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ కోనేటి బాబు, వైస్ ఎంపీపీ శివశంకర్, కో ఆప్షన్ సభ్యుడు మణిరెడ్డి, నాయకులు పళణిరెడ్డి, రాజారెడ్డి, సాయిరవి, చిన్నదొరై, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, కైలాసనాథకోన ఆలయ చైర్మన్ సుబ్రమణ్యం, కోన మాజీ చైర్మన్ భాస్కర్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేత, చిన్నాపట్టు సర్పంచ్ మోహన్



నాగలాపురం వెస్టుదళితవాడకు చెందిన టీడీపీ నేత వినోద్ కుమార్

నాగలాపురం: వెస్టు దళితవాడకు చెందిన 30 మంది తెలుగుదేశం పార్టీ నేతలు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. మండలంలోని నాగలాపురం వెస్టు దళితవాడకు చెందిన వినోద్ కుమార్, టీడీపీ నాయకుడు, చిన్నాపట్టు సర్పంచ్ మోహన్, ఉప సర్పంచ్ బాబు, తన అనుచరులతో కలిసి తిరుపతి ఎంపీ కార్యాలయంలో తిరుపతి ఎంపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త మద్దిల గురుమూర్తి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన సర్పంచ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి, ఆంధ్రప్రదేశ్ మరింత అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో వైఎస్సార్ సీపీలోకి చేరామన్నారు. 2024లో రానున్న ఎన్నికల్లో ఎంపీ గురుమూర్తిని అఖండ మెజారిటీతో గెలిపిస్తామని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అపరంజిరాజు, సర్పంచ్ చిన్నదొరై సుధా, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, నాయకులు చిరంజీవి, అలగేశన్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి అధునాతన సీహెచ్‌సీ



నూతన ఆసుపత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట : చంద్రగిరి నియోజక వర్గంలో అత్యంత అధునాతన సదుపాయాలతో కూడిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని చిన్నగొట్టిగల్లు మండల ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు చేసి, అధునాతన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (ఆస్పత్రి) ప్రారంభించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారని కొనియాడారు. రూ.7.25 కోట్లతో ఆధునిక వసతులతో చిన్నగొట్టిగల్లు చరిత్రలో నిలిచి పోయేలా ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25 లక్షల వరకు వైద్య సేవలు పొందేలా చొరవ తీసుకున్నారని అన్నారు. ఇకపై ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఎదురైనా తిరుపతికి వెళ్లాల్సిన పరిస్థితి లేదన్నారు. 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం మండల ప్రజలకు ఓ వరం అన్నారు. ఆసుపత్రి నిర్మాణంలో చొరవ తీసుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, సీడీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి, సీడీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు స్వరూప, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, సర్పంచ్ మనోహర్, భాస్కర్‌రెడ్డి, వైద్యాధికారి శ్రీధర్, శీలాబాను తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి అతిరుద్ర, శ్రీమహాలక్ష్మీయాగం

తిరుపతి కల్చరల్: దివ్యాంజన్ సాయ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు తుమ్మలగుంట మైదానంలో అతిరుద్ర, శ్రీమహాలక్ష్మీయాగం నిర్వహించనున్నట్లు సాయివిజయ్ శర్మ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకకల్యాణార్థం అతిరుద్రం మహాలక్ష్మీయాగం చేపడుతున్నట్లు తెలిపారు. యాగంలో భాగంగా రోజూ ఉదయం 7 నుంచి 10 గంటల వరకు గణపతి పూజ, గణపతి హవనం, రుద్రాభిషేకం, రుద్రహవనం, 10.30 నుంచి విష్ణుసహస్రనామ పారాయణం, మహాలక్ష్మి సహస్ర కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. యాగంలో పాల్గొనదలిచిన వారు రూ.699, రూ.799 టికెట్లను తీసుకోవాలని కోరారు. ఈనెల 2వ తేదీ నుంచి టికెట్లు ఇస్తామని తెలిపారు. టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు యాగానికి వచ్చే సమయంలో రెండు రాగి, ఇత్తడి ప్లేట్లు తీసుకురావాలని, శివలింగం, శ్రీచక్రం తదితర పూజా సామగ్రి ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా లభించే సొమ్ము ద్వారా వికలాంగులు, అంధుల సంక్షేమం కోసం వినియోగిస్తామని తెలిపారు. వివరాలకు 9490309105ను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని మహాలక్ష్మీ కృపాకటాక్షాలు పొందాలని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో కార్యనిర్వాహక సభ్యులు జానకిరామ్, ఆంజనేయ శాస్త్రి, వెంకటాద్రి, వెంకటరత్నం పాల్గొన్నారు.

సైకత 'బ్రహ్మానందం'

–హాస్యనటుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు

చిల్లకూరు: సినీ పరిశ్రమలో ఎంతో మంది హాస్యనటులు ఉన్నప్పటికీ ప్రత్యేకస్థానం సంపాదించుకుని ప్రేక్షకుల గుండెల్లో నవ్వులు పూయించగలిగే నటుడు.. వెయ్యి చిత్రాలకు పైగా నటించిన హాస్యబ్రహ్మ డాక్టర్ బ్రహ్మానందం పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం ఆయనకు ఓ శిల్పి సైకత శుభాకాంక్షలు తెలిపారు. చిల్లకూరు మండలం ఏరూరు గ్రామానికి చెందిన సైకత శిల్పకారుడు మంచాల సనత్‌కుమార్ మండలంలోని సముద్రం తీరంలో బ్రహ్మానందం సైకత శిల్పాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి ఒకటో తేదీ బ్రహ్మానందం పుట్టిన రోజును పురస్కరించుకుని సైకత శిల్పాన్ని రూపొందించినట్లు తెలిపారు. బ్రహ్మానందం భవిష్యత్తులో కూడా మరిన్ని చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకులకు కలకాలం గుర్తుండి పోవాలని ఆయన ఆకాంక్షించారు.

బొజ్జల.. గ్లోబల్ ప్రచారంలో దిట్ట



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి: బొజ్జల కుటుంబం గ్లోబల్ ప్రచారంలో దిట్టలని, 30 ఏళ్లుగా ఇలానే వారు ఎదుటి వారిపై గ్లోబల్ ప్రచారం చేసి, గెలిచారని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. తొట్టంబేడు మండలంలో ఎమ్మెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి ప్రచారంలో పాల్గొన్న సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. బొజ్జల కుటుంబం తమ ప్రత్యర్థులపై ఏదో ఒక నిందారోపణ, అభాండం వేసి, దుష్ప్రచారం చేయడంలో గ్లోబల్స్‌ను మించిపోయారన్నారు. ప్రజాసేవ చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిపై పలు నిందలు మోపి, దుష్ప్రచారాలు చేయడానికి సుధీర్‌రెడ్డి పన్నాగాలు పన్నుతున్నారని, అవి తిరిగి అతనికే తగులుతున్నాయన్నారు. ఎమ్మెల్యే తన సొంత నిధులతో ప్రజలకు సేవలందిస్తున్నారని చెప్పారు.

అపూర్వస్వాగతం : తొట్టంబేడు మండలంలో పర్యటిస్తుంటే అపూర్వ స్వాగతం లభించిందని ఎమ్మెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి అన్నారు. ప్రతి ఇంటికీ అడగకముందే జగనన్న సంక్షేమ పథకాలు అందాయని చెబుతున్నారని చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా జగనన్నకు ఓట్లు వేసేందుకు ప్రజలంత సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం వాసునాయుడు, వడ్లతాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నిర్మలమ్మ, సర్పంచ్ సక్కుబాయి, నాయకులు మోహన్, శ్రీనివాసులు, హరిరాయల్, గోపి, సునీల్, వసంత, గోపాల్, రామయ్య, చంద్రయ్యనాయుడు పాల్గొన్నారు.

భాకరాపేట ఘాట్‌లో కారు బోల్తా

భాకరాపేట : తిరుపతి–మదనపల్లె జాతీయ రహదారిలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో కారు బోల్తా పడింది. బుధవారం అన్నమయ్య జిల్లా కేవీపల్లె మండలం నూతనకాలువ గ్రామానికి చెందిన రెడ్డెప్పరెడ్డి, రమణమ్మ తిరుపతి నుంచి స్వగ్రామానికి బయలు దేరారు. మార్గం మధ్యలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో కారు అదుపు తప్పి లోయలో పడింది. ఈ ఘటనలో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, క్షతగాత్రులను 108లో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అలహాబాద్ వ్యక్తి తిరుపతిలో హత్య

తిరుపతి క్రైం: శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చిన ఓ డ్రైవర్ హత్యకు గురయ్యాడు. తిరుచానూరు రోడ్డులోని పాత ప్రైవేట్ బస్టాండ్ వద్ద రక్తపు మడుగులో ఉన్న మృతదేహాన్ని గుర్తించిన కొందరు ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేపట్టారు. 55 మంది శ్రీవారి భక్తులతో చత్తీస్‌గడ్ కోర్బా నుంచి తిరుపతికి వచ్చారని నిర్ధారించారు. మృతుడు అలహాబాద్‌కు చెందిన చంద్రసేన్ తివారీ(52)గా గుర్తించారు. క్లీనర్ నిరంజన్ డ్రైవర్ చంద్రసేన్ తలపై బలమైన రాడ్లతో హత్య చేసి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్య జరగడానికి పాత కక్షలు ఏమైనా ఉన్నాయా? లేక ఆర్థిక లావాదేవిలు ఏమైనా ఉన్నాయనే కోణంలో విచారిస్తున్నట్లు సీఐ మహేశ్వర్‌రెడ్డి వెల్లడించారు.

భారీగా తహసీల్దార్ల బదిలీలు

- ఉద్యోగ విరమణ, మూడేళ్లు పూర్తి కాని వారికి మినహాయింపు
- జిల్లాకు కేటాయించిన తహసీల్దార్లకు తదుపరి పోస్టింగ్‌లు
- ఉత్తర్వులు జారీచేసిన సీసీఎల్‌ఏ అడిషనల్ సెక్రటరీ ఇంతియాజ్

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్లను బదిలీ చేశారు. ఈ మేరకు బుధవారం సీసీఎల్‌ఏ అడిషనల్ సెక్రటరీ ఇంతియాజ్ ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన తహసీల్దార్ల బదిలీలను నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 67 మంది బదిలీ కాగా, చిత్తూరు జిల్లాకు ఇతర జిల్లాల నుంచి 67 మందిని నియమించారు. ఎన్నికల నిబంధనల మేరకు ఒకే మండలంలో మూడేళ్ల లోపు ఉన్న 5 మందిని, 30-6-2024 నాటికి ఉద్యోగ విరమణ కానున్న 11 మందికి బదిలీల నుంచి మినహాయింపు కల్పించారు. జిల్లాకు కేటాయించిన తహసీల్దార్లకు చిత్తూరు కలెక్టర్ తదుపరి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

తిరుపతిజిల్లా నుంచి బదిలీ అయిన తహసీల్దార్లు

కుప్పయ్య కలెక్టరేట్ ప్రొటోకాల్ విభాగం నుంచి వైఎస్సార్ కడప జిల్లా, భారతి కలెక్టరేట్ నుంచి వైఎస్సార్ కడప, ఝాన్సీలక్ష్మి శ్రీకాళహస్తి ఆర్డీఓ ఆఫీస్ ఏఓగా పనిచేస్తూ కర్నూలుకు, హనుమంత నాయక్ బాలయ్యపల్లె నుంచి అనంతపురం, కృష్ణ నాయుడుపేట నుంచి వైఎస్సార్ కడప జిల్లాకు, భార్గవి బీఎన్ కండ్రిగ నుంచి నంద్యాలకు, జరీనా సత్యవేడు నుంచి అన్నమయ్య జిల్లా, నిత్యానంద బాబు తొట్టంబేడు నుంచి అనంతపురం, ఉదయ్ సంతోష్ రేణిగుంట నుంచి కర్నూలు, శివప్రసాద్ ఏర్పేడు నుంచి వైఎస్సార్ కడప, శ్రీదేవి కేవీబీపురం నుంచి అనంతపురం, మధుసూదన్‌రావ్ పిచ్చాటూరు నుంచి వైఎస్సార్ కడప, ప్రమీల నారాయణవనం నుంచి వైఎస్సార్ కడప, వెంకటరమణ తిరుపతి అర్బన్ నుంచి వైఎస్సార్ కడప, సుబ్రహ్మమణ్యం తిరుపతి రూరల్ నుంచి అనంతపురం, శిరీష చంద్రగిరి నుంచి వైఎస్సార్ కడప, భాగ్యలక్ష్మి పాకాల నుంచి వైఎస్సార్ కడప, వెంకటేశ్వర్లు ఆర్‌సీ పురం నుంచి నంద్యాల, ఐ.సుబ్రహ్మణ్యం వడమాలపేట నుంచి వైఎస్సార్ కడప, పరమేశ్వరస్వామి పుత్తూరు నుంచి అనంతపురం, దస్తగిరయ్య ఎర్రావారిపాళ్యం నుంచి అనంతపురం, లోకేశ్వరి చిన్నగొట్టిగల్లు నుంచి అనంతపురం, రమేష్‌బాబు ఎండోమెంట్స్ నుంచి వైఎస్సార్ కడప, వెంకటలక్ష్మణ ఎండోమెంట్స్ నుంచి వైఎస్సార్ కడపలను బదిలీ చేశారు.

తిరుపతి జిల్లాకు కేటాయించిన తహసీల్దార్లు

ఉషారాణి (అనంతపురం), బాలకృష్ణ (అనంతపురం), మారుతి (అనంతపురం), వాణిశ్రీ(అనంతపురం), నాగరాజు(అనంతపురం), నరసింహారావ్(కర్నూలు), శ్రీనివాసగౌడ్ (కర్నూలు), హుసేన్ సాహెబ్ (కర్నూలు), రామాంజనేయులు (కర్నూలు), శరత్ (వైఎస్సార్ కడప), శ్రీవాణి (వైఎస్సార్ కడప), గంగయ్య (వైఎస్సార్ కడప), నాగేశ్వరరావు (వైఎస్సార్ కడప), రాజ సింహ నాగేంద్ర (వైఎస్సార్‌కడప), అలిఖాన్ (వైఎస్సార్ కడప), ఉదయభాస్కరరాజు (వైఎస్సార్‌కడప), శంకర్‌రావ్ (వైఎస్సార్ కడప), నారాయణరెడ్డి (వైఎస్సార్ కడప), ఉదయభారతి (వైఎస్సార్ కడప), లక్ష్మీదేవి (వైఎస్సార్ కడప), శ్రీధర్‌రావ్ (వైఎస్సార్ కడప), శ్రీరాములునాయక్ (వైఎస్సార్ కడప), నరసింహులు (వైఎస్సార్ కడప), మహబూబ్‌చంద్ (వైఎస్సార్‌కడప).

